

ఓటమి విజయానికి నాంది కావాలి



విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓటమి విజయానికి నాంది కావాలని ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు ఆడాలన్నారు. ఓటమిపాలైన క్రీడాకారులు వచ్చే క్రీడల్లో తిరిగి విజయానికి కృషి చేయాలన్నారు. అనంతరం అతిథులు విజేతలకు ట్రోఫీలను బహూకరించారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, పెద్దపల్లి డీవైఎస్‌వో సురేష్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుంటపల్లి స్వామి, క్రీడాకారులు, సంఘ సభ్యులు మహేశ్, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, రాజిరెడ్డి, నరేశ్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

● **పోటీల విజేతలు...:** ఎ కేటగిరిలో ప్రభాకర్, వెంకటేష్ ప్రథమ, ముస్తాక్, శ్రీనివాస్ ద్వితీయ స్థానాలు సాధించారు. బి కేటగిరిలో శ్రీనివాస్, వెంకటేశ్వర్లు ప్రథమ, గుంటపల్లి స్వామి, దామోదర్ ద్వితీయ స్థానంలో నిలిచారు.

హాస్టళ్లలో కొత్త మెనూ ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి

నాణ్యమైన ఆహారం, శుభ్రమైన తాగునీరు అందించాలి

కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టల్లో కొత్త డైట్ మెనూ అమలు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి హాస్టల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం వసతిగృహాల ప్రత్యేక అధికారులు, వెల్ఫేర్ అధికారులు, వార్డెన్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని వసతిగృహాల్లో విద్యార్థులందరికీ ఒకే రకమైన మెనూను ప్రభుత్వం అమలు చేయడం హర్షణీయమన్నారు. 14న జిల్లాలోని 110 సంక్షేమ హాస్టళ్లలో నూతన మెనూను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను, విద్యార్థులను, తల్లిదండ్రులను ఆహ్వానించాలని వెల్ఫేర్ అధికారులకు సూచించారు. ప్రారంభోత్సవం పండుగ వాతావరణంలో జరిగేలా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అన్నిహాస్టళ్లలో శుభ్ర మైన నీటితో వంట చేయాలని, పారిశుధ్యం నిర్వహణ సరిగ్గా ఉండాలన్నారు. నూతన మెనూను హాస్టళ్లలో ప్రదర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో జనార్దన్‌రావు, ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ నాగమల్లేశ్వర్, డీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీసీఐ జోరు



● ఇప్పటి వరకు 90 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోళు

● ప్రైవేట్ కంటే 25 వేల క్వింటాళ్లు అధికం

ప్రతిసారి సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు నామమాత్రంగా సాగుతుండేవి. ఈ యేడు పరిస్థితి మారింది. ప్రైవేట్ వ్యాపారులను మించి సీసీఐ పత్తి కొంటోంది. జమ్మికుంట మార్కెట్‌లో అక్టోబరు 22న సీసీఐ కేంద్రం ప్రారంభమైంది. రెండు వారాలపాటు తేమ ఎక్కువగా ఉందనే కారణంతో కొనుగోళ్లకు దూరంగా ఉంది. నవంబరు 10 నుంచి వేగం పెంచింది. 30 రోజుల వ్యవదిలో 90 వేల క్వింటాళ్ల పత్తి కొన్నది. గత సంవత్సరం డిసెంబరు 31 వరకు 17,299 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. మొత్తం 78,458 క్వింటాళ్లు కొన్నది. ఈ యేడు నెల రోజుల్లోనే అధిగమించింది. ప్రైవేట్ వ్యాపారులు సెప్టెంబరులోనే కొనుగోళ్లు ప్రారంభించినా ఇప్పటి వరకు 65 వేల క్వింటాళ్లు మాత్రమే కొన్నారు. కొర్రీలు పెట్టకుండా సీసీఐ మద్ధతు ధరతో పత్తి కొనుగోళ్లు చేస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - జమ్మికుంట, ఆంధ్రజ్యోతి



మార్కెట్ యార్డుకు వచ్చిన పత్తి (ఫైల్)

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) దూకుడు పెంచింది. మూడు నెలలుగా పత్తి కొంటున్న ప్రైవేట్ వ్యాపారులను పక్కకు నెట్టింది. 50 రోజుల వ్యవధిలో ప్రభుత్వ మద్ధతు ధరతో 90 వేల క్వింటాళ్ల పత్తి కొన్నది. ఈ ఏడాది అక్టోబరు 22న సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభించింది. పత్తిలో తేమ శాతం అధికంగా వస్తుందంటూ రెండు వారాలకు పైగా కొనుగోళ్లకు దూరంగా ఉంది. అప్పటికి ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్‌కు 6,500 రూపాయలు చెల్లించి పత్తి కొన్నారు. మార్కెట్ అధికారులు సీసీఐ అధికారులతో మాట్లాడినా వారు కొనుగోళ్లకు ముందుకు రాలేదు. నవంబరు 10 నుంచి సీసీఐ కొనుగోళ్లలో వేగం పెంచింది. గడిచిన 30 రోజుల వ్యవధిలో సుమారు లక్ష క్వింటాళ్లకు దగ్గరగా పత్తి కొనుగోళ్లు చేపట్టింది.

● **తగ్గిన తేమశాతం**

మార్కెట్ యార్డుకు ఇటీవల వస్తున్న పత్తిలో తేమ శాతం తగ్గింది. ప్రైవేట్ వ్యాపారులు పత్తి కొనుగోళ్లు నామమాత్రంగా చేపడుతున్నారు. సీసీఐ అధికారులు తేమశాతం కొంచెం అటు ఇటుగా ఉన్నా పత్తి కొంటున్నారు. ప్రతీసారి ఏవో సాకులు చెప్పే సీసీఐ సిబ్బంది ఈసారి ఎలాంటి కొర్రీలు పెట్టకపోవడంతో రైతులు మద్దతు ధరకు పత్తి అమ్ముకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. గత సంవత్సరం నవంబరు 6న సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించింది. డిసెంబరు 31 వరకు 17,299 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. మొత్తం 78,458 క్వింటాళ్లు కొన్నది. ఈసారి దూకుడు పెంచి డిసెంబరులోనే 90 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోళు చేసింది.

● **రూ. 65 వేల క్వింటాళ్ల ప్రైవేట్ కొనుగోళ్లు**

ఈ ఏడాది సెప్టెంబరు రెండో వారం నుండి పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. సీజన్ ప్రారంభంలో ప్రైవేట్ ట్రేడర్స్ 6,500 రూపాయలు చెల్లించి పత్తి కొన్నారు. నవంబరు 10వ తేదీ వరకు పోటాపోటీగా కొనుగోళ్లు చేసిన వ్యాపారులు సీసీఐ దూకుడుతో వేగం తగ్గించారు. గడిచిన మూడు నెలల్లో 65 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోళ్లు చేపట్టారు. ప్రైవేట్ కంటే సీసీఐ 25 వేల క్వింటాళ్లు అధికంగా పత్తి కొన్నది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయ సభ్యత్వ కార్డుల డిజిటలైజేషన్



డిజిటల్ కార్డులు

కరీంనగర్ కల్చరల్ డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రథాలయంలో సభ్యత్వ కార్డుల డిజిటలైజేషన్ ప్రారంభ మైంది. మన్నిక, కార్డు విధానం ఉంటే జాగ్రత్తగా కాపాడుకోవచ్చని భావించి ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మొత్తం 10,072 సభ్యత్వాలుండగా 9,713వ కార్డు నుంచి ఇప్పటి వరకు ఉన్న సభ్యత్వ కార్డులను డిజిటలైజ్ చేస్తున్నారు. పూర్తి వివరాలున్న 359 కార్డులు అప్‌డేట్ అవుతున్నాయి. పాత కార్డులు ఉన్న సభ్యులు పూర్తి వివరాలు అందజేస్తే అప్‌డేట్ చేస్తామని గ్రంథాలయ కార్యదర్శి ఎ సరిత, లైబ్రేరియన్ జి సరిత తెలిపారు. అప్‌డేట్ అయిన కార్డులను ఎప్పటిక ప్పుడు పాఠకులకు అందజేస్తున్నామన్నారు.

పట్టుదలే ఆయుధంగా..
అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయిలో పతకాలు
ఆర్మీలో ఉద్యోగాలు సాధించిన ఎస్సారార్ విద్యార్థులు 7

పోలీసుల విస్తృత తనిఖీలు
ధ్రువ పత్రాలు లేని 54 వాహనాలు సీజ్ 6
డ్రంకెన్‌డ్రైవ్‌లో 18 మందిపై కేసు

రాష్ట్ర ప్రభుత్వం బీసీల వాటా పెంచాలి 8
ఫీజు బకాయిలు విడుదల చేయాలి
బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు సంజయ్‌కుమార్

పారిశుధ్య పనులు మెరుగుపరచాలి

మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి



పారిశుధ్య కార్మికుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్‌బాజ్‌పాయి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా పారిశుధ్య పనులను మరింత మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగరంలో ఆమె పర్యటించి పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భగత్‌నగర్, కిసాన్‌నగర్, బస్టాండ్ తదితర ప్రాంతాలను సందర్శించి పారిశుధ్య కార్మికుల హాజరుశాతం రిజిస్టర్‌ను తనిఖీ చేసి హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 7 గంటలకే కార్మికులు క్షేత్రస్థాయిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని, డివిజన్లలో స్వచ్ఛ ఆటోల ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. తడిచెత్తను వర్మీ కంపోస్టుకు, పొడిచెత్తలో డబ్బాలు, అట్టలు, డీఆర్‌సీసీకి పంపించాలని సూచించారు. డంపింగ్ యార్డుకు వెళ్లే చెత్తను తగ్గించాలన్నారు. ఓపెన్ డ్రైనేజీల్లో చెత్తాచెదారాన్ని తొలగించి, దోమలు వృద్ధి చెందకుండా స్ప్రే, ఫాగింగ్ వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. నివాస గృహాల చుట్టూ ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని ఆదేశించారు.

వెంకన్న ఆలయానికి మోక్షమెప్పుడో?



● భూమిపూజతోనే సరిపెట్టిన వైనం

● టీటీడీ పాలకవర్గ నిర్ణయం కోసం ఎదురుచూపులు

● ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని భక్తుల విన్నపం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్‌లో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ పనుల్లో ఏడాదిన్నర కాలంగా కదలిక లేకపోవడంతో స్వామివారి భక్తులు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం 20 కోట్ల రూపాయలు మంజూరు చేసి కరీంనగర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఐదు కోట్ల రూపాయలు వెచ్చించేందుకు సిద్ధపడి పదెకరాల స్థలాన్ని ఆలయానికి కేటాయించింది. దేవాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన అయితే జరిగింది కానీ ఆ తర్వాత పనుల్లో పురోగతి లేకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయంతోపాటు జిల్లాలో నిర్మించతలపెట్టిన ఇస్కాన్ టెంపుల్‌కు కూడా ప్రభుత్వం మూడెకరాల స్థలాన్ని కేటాయించింది. ఇటీవల ఆ స్థల కేటాయింపును ప్రభుత్వం రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

కరీంనగర్ నుంచి వేములవాడకు వెళ్లే దారిలో పద్మనగర్ సమీపంలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించ తలపెట్టారు. ఈ దేవస్థానం నుంచి వేములవాడ రాజరాజేశ్వరస్వామి, కొండగట్టు అంజనేయస్వామి, ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని కలిపి టూరిజం కారిడార్ ఏర్పాటు చేస్తే వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది.

ఏడాదిన్నర కాలంగా నిలిచిన పనులు

ఏడాదిన్నర క్రితం నిర్వహించిన భూమిపూజకు అప్పడి టీటీడీ ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. భూమిపూజ తర్వాత ఆలయ పనులు ఆగిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారింది.

మిగతా 8వ పేజీలో..



భూమి పూజ చేస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి (ఫైల్)

హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు



హ్యాండ్ బాల్ క్రీడాకారులతో అకాడమిక్ హైట్స్ చైర్మన్ సుజిత్‌రావు, హ్యాండ్ బాల్ అసోసియేషన్ సభ్యులు

భగత్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలుర సెలక్షన్స్ కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు జనవరి 27 నుంచి గచ్చిబౌలి హైదరాబాద్‌లో నిర్వహించే 2వ హెచ్ఎఫ్ఎల్ ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బసరవేణి లక్ష్మణ్, వీర్ల వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ యాదగిరి సుజిత్‌రావు, డైరెక్టర్ పొలసాని శిరీష, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి, సంయుక్త కార్య దర్శి నమిలికొండ ప్రభాకర్, పీడీలు, పీఈటీలు, శ్రీధర్, వీర్‌పాల్, అమర్ పాల్గొన్నారు.

16 నుంచి జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చీఫ్ మినిస్టర్ కప్‌లో భాగంగా జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్నామని డీవైఎస్‌వో బి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ క్రీడాంశాల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. 16న ఉదయం 11 గంటలకు క్రీడల ప్రారంభోత్సవం నిర్వహించనున్నామన్నారు.

● ఈ నెల 15వ తేదీన స్టేడియంలో బేస్ బాల్ పోటీలను నిర్వహిస్తారు. 16న ప్రాంతీయ క్రీడా పాఠశాలలో అథ్లెటిక్స్ జూడో పోటీలను అంబేద్కర్ స్టేడియంలో, ఆర్చరీ, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో పోటీలను నిర్వహించనున్నారు. 17న ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రెజ్లింగ్ పోటీలను అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలను, అకాడమీ హైట్స్ పాఠశాలలో హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహిస్తారు. అంబేద్కర్ స్టేడియంలో బాక్సింగ్, స్విమ్మింగ్, బాస్కెట్ బాల్, యోగా పోటీలను నిర్వహించనున్నారు. లెజెండ్ పాఠశాలలో ఉషు పోటీలను నిర్వహిస్తారు. 18న జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో టేబుల్ టెన్నిస్ పోటీలను, ప్రాంతీయ క్రీడా పాఠశాలలో వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్ పోటీలను నిర్వహించనున్నారు.

అంబేద్కర్ స్టేడియంలో హాకీ, నెట్‌బాల్ పోటీలను ఇండోర్ స్టేడియంలో సెపక్‌తక్రా పోటీలను నిర్వహిస్తారు. చెస్ పోటీలను జీనియస్ చెస్ అకాడమీలో నిర్వహించనున్నారు. ఇండోర్ స్టేడియంలో కరాటే, కిక్ బాక్సింగ్ పోటీలను, శాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో సైక్లింగ్ పోటీలను నిర్వహించనున్నారు. అంబేద్కర్ స్టేడియంలో ఆత్యపత్య, పవర్ లిఫ్టింగ్, సాఫ్ట్ బాల్ పోటీలను నిర్వహిస్తారు. 19న ఇండోర్ స్టేడియంలో తైక్వాండో పోటీలను నిర్వహించనున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటించాలి

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్

సుభాష్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులకు పేస్కేల్ ప్రకటించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోరెడ్డి దామోదర్‌రెడ్డి, మండల ఆనం దం, జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం (సాగర్), పంజాల జగన్‌మోహన్‌గౌడ్, మడ్లపెల్లి గంగాధర్, ఎండీ నజీర్, వడ్లూరి ఆదిమల్లు, బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, జుట్టు లచ్చయ్య, కొంకటి శంకర్, సమ్మయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న గోనె శ్రీనివాస్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పొద్దుటూరి సంజీవరెడ్డి, సరోజన, శ్రీలత కారులో పట్టణంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యారు. తిరిగి కరీంనగర్ వైపు వెళ్తున్న క్రమంలో తుమ్మనపల్లి వద్ద కారుకు ఎదురుగా ఓ వాహనం వచ్చి ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఇందులో శ్రీలతకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

కొడిమ్యాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెప్యాల గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి అనే వ్యక్తిని గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. చెప్యాల నుంచి నల్లగొండ వైపు వాకింగ్‌కు వెళ్లి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. లచ్చిరెడ్డిని 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పాపయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీకి చెందిన కడమంచి పాపయ్య (54)అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపయ్య ఇటీవల తన సైకిల్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతానికి వచ్చి ఇంటికి తిరిగి వెళుతున్నాడు. వెనుక వైపు నుంచి కారు వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన అతన్ని మొదట సిరిసిల్లకు తరలించారు. మెరుగైన చికిత్స పొందిన పాపయ్య స్వల్పంగా కోలుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. కూలీ పనులతో పాటు పాములను పట్టి బతుకు వెళ్లదీసేవాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పాపయ్యకు భార్య, కొడుకు ఉన్నారు.

పురుగుల మందు తాగిన ఒకరి మృతి

మానకొండూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన బనుక రవి (46) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవితో పాటు అతడి ఇద్దరు అన్నలు ఓదెలు, పర్వతాలు మధ్య కొంత కాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ నెల 9న వివాదం ముదరడంతో వారి వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. రవికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

హాల్‌టికెట్ తీసుకొని వస్తుండగా రోడ్డు ప్రమాదం

- చికిత్స పొందుతూ వివాహిత మృతి
- మృతురాలికి 10 నెలల కూతురు


పూజిత(ఫైల్)

ఇల్లంతకుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పరీక్షలు రాయడానికి కరీంనగర్‌లో హాల్‌టికెట్ తీసుకొని ద్విచక్రవాహనంపై వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆకారపు పూజిత (23) అనే వివాహిత చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారెడ్డిపల్లె గ్రామానికి చెందిన పూజితకు సిద్దిపేట జిల్లా లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆకారపు అజయ్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 10 నెలల కూతురు శ్రేష్ఠ ఉంది. పూజిత కరీంనగర్‌లోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. వారం రోజుల క్రితం నారెడ్డిపల్లె గ్రామానికి వచ్చిన పూజిత డిగ్రీ హాల్‌టికెట్ తీసుకోవడానికి బుధవారం కరీంనగర్‌కు ద్విచక్రవాహనంపై భార్యాభర్తలు వెళ్లారు. ఇంటికి వస్తుండగా పొత్తూరు గ్రామసమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పూజితకు తీవ్ర గాయాలయ్యాయి. భర్త అజయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పూజిత మృతిచెందింది. భర్త అజయ్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నాడు. పూజిత అంత్యక్రియలు లింగారెడ్డిపల్లె గ్రామంలో నిర్వహిం చారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సముద్రాల కనకయ్య(67) రిటైర్డు సింగరేణి ఉద్యోగి. ఇంటి పనుల నిమిత్తం షాపుకు వెళ్లి ఇంటికి వస్తున్న క్రమంలో హుజూరాబాద్ వైపు వెళ్తున్న సిలిండర్ల లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో తలకు, కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే గ్రామస్థులు మాజీ సర్పంచ్‌కు విషయం తెలియజేశారు. ఘటన స్థలానికి చేరుకొని సొంత కారులో హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కనకయ్య కుమారుడు సముద్రాల కిషోర్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని యువకుడు..

జగిత్యాల అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని బీట్ బజార్‌కు చెందిన పల్లె నిశాంత్ కుమార్ బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందినట్లు టౌన్ ఎస్సై మన్మదరావు తెలిపారు. పట్టణంలోని బీట్ బజార్‌కు చెందిన మృతుడు బుధవారం రాత్రి స్నేహితుని వివాహ వేడుకల్లో పాల్గొని స్కూటీపై ఇంటికి వస్తుండగా బీట్ బజార్ వద్ద స్విఫ్ట్‌డిజైర్ కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వర్క్‌ఫ్రం హోం పేరుతో మోసం

- జగిత్యాల యువకుడికి రెండు లక్షలు టోకరా

జగిత్యాల అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోం అని ఆశ పడి వాట్సాప్ లింక్ ఓపెన్ చేసిన జగిత్యాల యువకుడు 2 లక్షల 9 వేల రూపాయి పోగొట్టుకుని గురువారం పోలీసులను ఆశ్రయించాడు. జగిత్యాల పట్టణంలోని ఉస్మాన్ పురకు చెందిన ఇర్ఫాన్‌ఖాన్ అనే యువకుడికి అక్టోబర్ 21వ తేదీన వాట్సాప్‌లో వర్క్ ఫ్రం పేరుతో వాట్సాప్‌లో లింక్‌వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా వారు డబ్బులు చెల్లించమని చెప్పడంతో పలు దఫాలుగా 2 లక్షల 9 వేల రూపాయలను చెల్లించగా ఉద్యోగం ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మన్మదరావు తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధులకు గాయాలు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేటలో గురువారం కోతులు దాడిచేసి వృద్ధులను గాయపరిచాయి. గ్రామానికి చెందిన రామిడి మాధవరెడ్డి, కలువల సరోజన ఇళ్ల ముందు కూర్చొని ఉండగా కోతులు కాళ్లను, చేతులను తీవ్రంగా గాయపరిచాయి. మెరుగైన వైద్యంకోసం వారిని కాల్వశ్రీరాం పూర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కోతులు మందలుగా గ్రామంలో వీధులవెంట విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, కోతులను చూసి పిల్లలు భయపడి ఇంట్లోకి పరుగులు తీస్తున్నారని, వృద్ధులు అక్కడే కూర్చొని ఉండగా మీదపడి గాయపరుస్తున్నాయని, ప్రభుత్వం కోతుల నివారణకు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మెడికల్ హబ్‌గా రామగుండం



సింగరేణి మెడికల్ కళాశాల

- మెడికల్, నర్సింగ్ కళాశాలల ఏర్పాటు
- డెంటల్ కళాశాల అనుమతి కోసం ప్రతిపాదనలు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామగుండం మెడికల్ హబ్‌గా మారుతోంది. ఇప్పటికే మెడికల్ కళాశాల ప్రారంభం కాగా, దానికి అనుబంధంగా నర్సింగ్ కళాశాల, పారా మెడికల్ కళాశాల ఈ ఏడాదిలో మంజూరైంది. ఈనెల 2న 60సీట్లతో నర్సింగ్ కళాశాలను ప్రారంభం కాగా, 30సీట్లతో పారా మెడికల్ కళాశాల ప్రారంభమైంది. అలాగే రామగుండంలో డెంటల్ కాలేజీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రతిపాదన పంపగా, త్వరలోనే ఆమోదం లభించే అవకాశాలున్నాయి. ఇందుకోసం స్థల సేకరణ కూడా ప్రారంభమైంది.

మెడికల్ కళాశాలలో 450 మంది విద్యార్థులు..

సింగరేణి మెడికల్ కళాశాలను 150సీట్లతో 2022లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. కాలేజీలో 450మంది విద్యార్థులు ఉండగా, 7శాతం సింగరేణి కార్మికుల ఉద్యోగుల పిల్లలకు కేటాయించారు. ఇటీవల రూ.26కోట్లతో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇందులో 58మంది విద్యార్థులు చేరారు. అదే విధంగా 30పారామెడికల్ సీట్లను కూడా భర్తీ చేశారు.

'సిమ్స్'కు అనుబంధంగా డెంటల్ కళాశాల..

సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)కు అనుబంధంగా డెంటల్ కళాశాల ఏర్పాటు చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రతిపాదనలు పంపారు. ఆయన సానుకూలంగా స్పందించి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నివేదికను ఎన్ఎంయూకు పంపారు. 100సీట్లతో రామగుండంలో బీడీఎస్ కళాశాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేంద్రానికి లేఖ రాశారు. త్వరలోనే డెంటల్ కళాశాల వచ్చే అవకాశం ఉంది. అలాగే సిమ్స్‌కు అనుబంధంగా గోదా వరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 140 కోట్లతో ఐదు అంతస్థుల 720 పడకల సామర్థ్యం గల భవన నిర్మాణం చేపట్టారు. 2025 ఆగస్టుకల్లా పనులు పూర్తి కావాలని మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అధికారు లను ఆదేశించారు. రూ.16 కోట్లతో ఐసీ భవనం, టీబీ సెంటర్‌ను కూడా ఏర్పా టు చేయాలని, ఈ పనులను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఐదు అంతస్థుల భవనం పూర్తయితే మెడికల్ కళాశాల విద్యార్థులకు, రామగుండం ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందనున్నది.


నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్థుల భవనం

పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి..

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



రామగుండానికి పూర్వ వైభవం తీసుకురావడానికి మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను తీసుకు వచ్చాం. నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. మూడు 800 మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్లు, రూ.520 కోట్లతో మెడికల్ కళాశాల, రూ.140కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రూ.150కోట్లతో ఇంటి గ్రేటెట్ స్కూళ్లు, రూ.26కోట్లతో నర్సింగ్ కళాశాల, త్వరలో డెంటల్ కళాశాల ఏర్పాటు చేసి మెడికల్ హబ్‌గా తీర్చిదిద్ది ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం.


నిర్మాణంలో ఉన్న ఐసీయూ కేంద్రం

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఖాన్‌పుర ప్రాంతంలో బుధవారం కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడులో 403 గ్రాముల గంజాయి పట్టుబడింది. టాస్క్‌ఫోర్స్ సీఐ కె.నాగేశ్వర్‌రావు ఆధ్వర్యం లో తనిఖీలు నిర్వహించగా ఖాన్‌పుర ప్రాంతానికి చెందిన ఎండీ రహీం, సయీద్ సోయబ్ అక్తర్‌ల వద్ద గంజాయి పట్టుబడిందని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి గంజాయితో పాటు 2 మొబైల్‌ఫోన్‌లను సీజ్ చేశామని సీఐ తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ పులి నగేష్‌గౌడ్, కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసీంబీ, కమలాకర్, కమాలుద్దీన్, సంతోష్ సాయి తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

చొప్పదండి: మండలంలోని రేవెల్లి గ్రామంలో కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ పోలీసులు గుడుంబాను పట్టుకున్నారు. ఎస్సై విజయభాస్కర్ ఆధ్వర్యంలో సిబ్బంది కుంటాల అంజయ్య వద్ద రెండు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. గుడుంబా తయారు చేసినా తరలించినా చర్యలుతీసుకుంటాయని సీఐ హెచ్చరించారు.

యువకుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌లో ముల్కల నరేశ్(32) అనే యువకుడు బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావపల్లి గ్రామానికి చెందిన నరేశ్ సెంట్రింగ్ కూలీగా పనిచేసేందుకు సిరిసిల్ల పట్టణానికి రెండేళ్ల క్రితం వలసవచ్చాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడికి దూరంగా భార్య ఉంటుంది. దీంతో నాలుగు నెలల క్రితం మరో మహిళను పెళ్లిచేసుకున్నాడు. ఏడాది క్రితం తల్లి అనారోగ్యం పాలుకావడంతో చికిత్స కోసం అప్పులు అయ్యాయి. ఈ అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడని తల్లి లచ్చవ్వ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ఆటంకం

- తుర్తి గ్రామంలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సమస్య - ఉన్నతాధికారులకు సమస్య వివరించిన సిబ్బంది


సర్వే నిలిచిపోయిన తుర్తి గ్రామం

కథలాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దట్టమైన అడవుల్లో విసిరేసినట్టు ఉన్న మండలంలోని తుర్తిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగడం లేదు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో మూడు రోజులుగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్‌లో యాప్ ద్వారా ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. తుర్తిలో అందుకు భిన్నంగా నేటికీ సర్వే ప్రారంభం కాలేదు. ప్రజాపాలనలో ఇక్కడ 236 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను గుర్తించడానికి ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేస్తున్న విషయం తెలిసిందే. బీమారం, కొడిమ్యాల, రుద్రంగి, చందుర్తి మండలాల సరిహద్దుల్లో అటవీ ప్రాంతంలో ఉన్న తుర్తిలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు సంబంధించిన టవర్ మాత్రమే ఉంది. ఈ టవర్ రెండు సంవత్సరాలుగా పనిచేయడం లేదు. దీంతో సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో అంబారిపేట నుంచి టీవీల కేబుల్ ద్వారా కొందరు వినియోగదారులు బూస్టర్ ఏర్పాటు చేసుకుని సేవలు పొందుతున్నారు. ఈ సేవలు కొందరికి మాత్రమే పరిమితం కాగా సక్రమంగా పనిచేయడం లేదు. పంచాయతీ కార్యదర్శి తన యాప్‌లో సర్వే వివరాలు నమోదు చేసుకోడానికి ముందు లాగిన్ కావాల్సి ఉంటుంది. అప్పుడు మొబైల్‌కు వచ్చే ఓటీపీ ఎంట్రీ చేస్తేనే సర్వే మొదలు పెట్టడానికి అవకాశం ఉంటుంది. అక్కడ ఏ ఇతర నెట్‌వర్క్‌లు లేకపోవ డంతో సర్వేకు పూర్తిగా ఆటంకం ఏర్పడింది. ఈ నెల 20వ తేదీలోపు సర్వే పూర్తి చే యాలని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో నెట్‌వర్క్ లేకపోవడంతో సమ స్యగా మారింది. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి గురువారం ఎంపీడీవోకు వివరించారు. 'ఆంధ్రజ్యోతి' ఎంపీడీవో శంకర్‌ను దీనిపై వివరణగా కోరగా నెట్‌వర్క్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

- ధ్రువపత్రాలు లేని 54 వాహనాలు సీజ్
- డ్రంకెన్‌డ్రైవ్‌లో 18 మందిపై కేసు


తనిఖీ చేస్తున్న ప్రొబెషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో బుధవారం అర్ధరాత్రి ప్రొబెషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని 54 వాహనాలను సీజ్ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 18 మందిపై కేసులు నమోదు చేశారు. కరీంనగర్ టౌన్ పోలీస్ సబ్ డివిజన్‌లో ప్రొబెషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి ఆధ్వర్యంలో టౌన్ ఏసీపీ నరేందర్, మాధవి తనిఖీలను నిర్వహించారు. రాత్రి నగరంలో బ్రీత్ ఎనలైజర్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్‌లతో మద్యం సేవించిన వారిని, అనుమానితులను తనిఖీ చేసి పలువురిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం వదిలిపెట్టారు. నార్కొటిక్ డ్రగ్స్ గుర్తించేందుకు శిక్షణ తీసుకున్న జాగిలం లియోతో పలు వాహనాలను, ఆర్టీసీ బస్టాండ్ కార్గో సర్వీస్ సెంటర్‌లోని పార్శిళ్లను, అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో సీఐలు కోటేశ్వర్, విజయ్‌కుమార్, జాన్‌రెడ్డి, ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి వేధింపులు.. యువతి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని ఓ గ్రామంలో యువకుడి వేధింపులు భరించలేక ఓ యువతి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి ఒడిగట్టింది. ఆమె పరిస్థితి విషమంగా మారడంతో మండలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సిరిసిల్ల న్యాయమూర్తికి సమాచారం అందించడంతో ఆసుపత్రికి చేరుకుని బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి అదే గ్రామంలోని ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. సదరు యువకుడు తరుచూ ఆమెను సెల్‌ఫోనులో వేధించేవాడు. తట్టుకోలేని యువతి గురువారం ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఓ ఆసుపత్రికి తరలించారు. యువతి ఆత్మహత్యకు యత్నించడంతో యువకుడు పారిపోయాడు. స్థానిక పోలీసులు ఘటనపై వివరాలను సేకరిస్తున్నారని తెలిసింది.

బంగారు ఆభరణాలు బాధితురాలికి అప్పగింత


ఆభరణాలను అప్పగిస్తున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ హ్యాండ్‌బ్యాగ్‌లో 10 తులాల బంగారు ఆభరణాలు మరిచిపోయిన బాధితురాలికి పోలీసులు గురువారం ఆభరణాలను అప్పగించారు. కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి చెందిన మామిడిపల్లి హేమశ్రీ(25) తన భర్త గణేష్‌తో కలిసి బుధవారం కరీంనగర్‌లో ఒక పెళ్లి వేడుకకు హాజరైంది. తిరిగి జగిత్యాలకు వెళ్లేందుకు ఫంక్షన్‌హాల్ నుంచి బస్టాండ్‌కు ఆటోలో ప్రయాణించింది. ఆటో దిగి బస్టాండ్‌లోకి వెళ్లిన ఆ మహిళ కొద్దిసేపటికి తన బ్యాగును ఆటోలోనే మరిచిపోయినట్లు గ్రహించి వెంటనే ఒకటో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ రెండు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, ఇతర సాంకేతికత ఆధారంగా ఆటోను గుర్తించిన పోలీసులు సంబంధిత ఆటో డ్రైవర్ నుంచి బ్యాగును, అందులోని 10 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బంగారు ఆభరణాలను గురువారం కరీంనగర్ అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా బాధితురాలికి అందజేశారు. ఆభరణాలు గుర్తించిన సీఐ బిల్ల కోటేశ్వర్, సిబ్బంది, క్రైమ్‌పార్టీ కానిస్టేబుళ్ళు కుమార్‌లకు పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి రివార్డులు అందజేశారు.

గోరంటాలలో బ్రిడ్జి శిలాఫలకం ధ్వంసం


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


గోరంటాల వద్ద ధ్వంసమైన శిలాఫలకం

గంభీరావుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం గోరంటాల వద్ద బ్రిడ్జి నిర్మాణం పనులకు సంబంధించి, శంకుస్థాపన సమయంలో ఇటీవల ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రూ: 65 లక్షలతో గత నవంబరు 30న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అబివృద్ధి పనులు ప్రారంభించారు. అందులో భాగంగా వేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం ఉదయం ధ్వంసం చేశారు. దీనిపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, వెంకటి, ప్రవీణ్, పర్శ రాములు తదితరులు ఎస్పీ అఖిల్ మహాజన్‌కు ఫిర్యాదు చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.

చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్: అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల నాయకులు అన్నారు. గంభీరావుపేట మండలం రైతుల సౌకర్యార్థం గోరంటాల నుంచి రత్నగిరిపల్లెను కలుపుతూ క్యాజ్‌వే నిర్మాణానికి ప్రభుత్వం రూ. 65లక్షలు మంజూరు చేసిందన్నారు. గత నెల క్యాజ్‌వే పనుల ప్రారంభోత్సవం కోసం శిలాఫలకాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారన్నారు. గురువారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఆరోపి ంచారు. మూడు రోజుల క్రితం గజసింగవరం రాజేశ్వర్‌రావనగర్ మేయిన్ రోడ్డుకు పక్కన గుర్తు తెలియన వ్యక్తులు బీఆర్ఎస్ గద్దెను కూల్తేస్తే అది కాంగ్రెస్ పార్టీ నాయకులు కూర్చారని బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన గద్దెను, శిలాఫలకం కూల్చిన వారిపై ఎస్పీ విచరణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, ఎల్లారెడ్డిపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమరిశెట్టి తిరుపతి, సీనియర్ నాయకులు పర్శహన్మాండ్లు, పిట్ల వెంకటి, అంజిరెడ్డి, పరశురాములు, ప్రసాద్‌రావు, ప్రవీణ్ , రామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

గణేశ్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమైనట్లు శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. ఉదయం జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 13,659 విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 12,970 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదో సెమిస్టర్‌లో మొత్తం 11,032 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10,599 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు.

ఇంటి పైకప్పు కూలి షార్ట్‌సర్క్యూట్ ఒకరి సజీవదహనం


తిరుపతి(ఫైల్)

మల్యాల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న ఓ వ్యక్తి షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటల్లో అక్కడిక్కడే సజీవ దహనం అయ్యాడు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లికి చెందిన గాతం తిరుపతి (37) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. గురువారం రాత్రి రోజు వారి మాదిరిగానే తిరుపతి తమ పాత ఇంట్లో ఒక్కడే పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో శిథిలావస్థలో ఉన్న ఇంటి పైకప్పు కూలింది. దీంతో ఇంట్లోని విద్యుత్ తీగలు తెగి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో బయటకు రాలేక తిరుపతి మంటల్లోనే సజీవదహనం అయ్యాడు. చుట్టు పక్కల వాళ్లు గమనించి పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో సీఐ నీలం రవి చేరుకొని సంఘటన స్థలం పరిశీలించగా ఫైర్ ఇంజన్ అక్కడకు చేరుకొని మంటలను ఆర్పివేసింది. అప్పటికే తిరుపతి మృతిచెందడంతో మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

పట్టుదలే ఆయుధంగా..

అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయిలో పతకాలు

ఆర్మీలో ఉద్యోగాలు సాధించిన ఎస్సారార్ విద్యార్థులు



అథ్లెటిక్స్ ట్రాక్స్‌పై మనోజ్, సందీప్

పట్టుదలే ఆయుధంగా అథ్లెటిక్స్‌లో రాణించి ఆర్మీలో ఉద్యోగాలు సాధించారు ఇద్దరు ఎస్సారార్ కళాశాల విద్యార్థులు. అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ చాటి బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు. ఆర్మీలో ఫిజికల్ టెస్ట్, రన్నింగ్‌లో ప్రతిభ చూపి రాష్ట్రంలోనే మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఆర్మీలో శిక్షణ పూర్తి చేసుకొని ప్రస్తుతం జమ్మూకాశ్మీర్‌లోని లడక్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల విద్యార్థులు చింతల సందీప్, ఏ సాయిమనోజ్‌లు చిన్నప్పటి నుంచి ప్రతిభ గల విద్యార్థులుగా పేరు తెచ్చుకున్నారు. సందీప్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామరకుంట మారుమూల గ్రామానికి చెందినవాడు కాగా సాయిమనోజ్‌ది కరీంనగర్. ఎస్సారార్‌లో డిగ్రీ చదువుతుండగా వీరి చూపు అథ్లెటిక్స్ వైపు మళ్లింది. వీరి ఆసక్తిని గమనించిన కోచ్ వరుణ్ కృష్ణన్ అథ్లెటిక్స్‌లో ఓనమాలు నేర్పించారు. ఫలితంగా అనతి కాలంలోనే వీరు జిల్లా, రాష్ట్ర అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటారు.

ఆర్మీలో ఉద్యోగం సంపాదించడమే లక్ష్యమని వారు తమ మనసులోని మాటను కోచ్ వరుణ్‌కృష్ణన్‌కు చెప్పారు. దీంతో వరుణ్‌కృష్ణన్ ఇద్దరు విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. దీంతో వీరు 2022, 2023 సంవత్సరాల్లో జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి, అంతర యూనివర్సిటీ అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ చాటి బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు. అనంతరం 2023 మార్చిలో జరిగిన ఆన్‌లైన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో సందీప్, ఏ సాయిమనోజ్‌లు ఉత్తీర్ణుల య్యారు. అనంతరం ఆగస్టులో ఖమ్మంలో జరిగిన ఫిజికల్ టెస్ట్, రన్నింగ్‌లో ప్రతిభ చూపి రాష్ట్రంలోనే మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. తదనంతరం జరిగిన వైద్య పరీక్షల్లో ఉత్తీర్ణులై ఆర్మీలో ఉద్యోగాలు సాధించి తమ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు సందీప్, మనోజ్‌లు. నాసిక్‌లో చింతల సందీప్ శిక్షణ పొందగా, మనోజ్ బెంగుళూరులో శిక్షణ పూర్తి చేసుకున్నాడు. అనంతరం 2024 జూన్ 20న జమ్మూకాశ్మీర్‌లోని లడక్‌లో విధుల్లో చేరారు.

సాయిమనోజ్ ప్రతిభ



మనోజ్ తండ్రి మోహన్, తల్లి జ్యోతి. ఇద్దరూ కూలి పనులు చేస్తూ తమ కొడుకును డిగ్రీ వరకు చదివించారు. మనోజ్ రాష్ట్ర స్థాయిలో జరిగిన అంతర్ జిల్లా అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకాన్ని సాధించాడు. 2022 జనవరి 4 నుంచి 7 వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో జరిగిన అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ చాటాడు. హైదరాబాద్ గచ్చిబౌలిలో 2022 మే 14, 15 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-20 పురుషుల అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకాలు సాధించాడు. 2022 అక్టోబరు 22, 23 తేదీల్లో వరంగల్‌లో జరిగిన 400 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకాన్ని సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. వివిధ వయస్సు గ్రూపుల్లో జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో నాలుగు బంగారు, మూడు రజత, ఒక కాంస్య పతకాన్ని సాధించాడు.

సందీప్‌కు రెండు స్వర్ణాలు



సందీప్ తండ్రి రాజయ్య వ్యవసాయ కూలీ. 2023లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొని 3 వేల మీటర్ల స్ట్రిపుల్ చేజ్‌లో బంగారు పతకాన్ని, 1500 మీటర్ల పరుగులో రజత పతకాన్ని సాధించాడు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో 2023లో జరిగిన సౌత్‌జోన్ జాతీయ అథ్లెటిక్స్‌లో పాల్గొని ప్రతిభ చాటాడు. 2023 బెంగుళూరులో జరిగిన అఖిల భారత అథ్లెటిక్స్‌లో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించాడు. అథ్లెటిక్స్‌లో రెండు బంగారు, రెండు రజత, రెండు కాంస్య పతకాలను సాధించాడు.

రాజన్నను దర్శించుకున్న సినీనటి


గార్లపాటి కల్పలతకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని పుష్ప సినిమా హీరో అల్లు అర్జున్ తల్లి క్యారెక్టర్ చేసిన గార్లపాటి కల్పలత దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి గురువారం విచ్చేసిన ఆమె ముందుగా పార్వతీపరమేశ్వరుల ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్న ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

మల్యాల: ఇటీవల విడుదలైన పుష్ప-2లో పుష్పకు తల్లిగా నటించిన గార్లపాటి కల్ప లత గురువారం కొండగట్టు అంజనేయ స్వామిని దర్శించుకన్నారు. ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వ దించారు. ఆలయ పర్యవేక్షకులు హరిహ రనాథ్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు


అలంకరణలో స్వామివారు

ధర్మపురి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీ యమ ధర్మరాజు ఆలయంలో గురు వారం స్వామివారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు.

బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి అండర్-17 బేస్‌బాల్ పోటీలకు వెల్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెల నిర్మల్ జిల్లాలో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు విశేష ప్రతిభచాటింది. అందులోని పాఠశాల క్రీడాకారులు కె సాయిచరణ్, హాసిని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎండి యూనిస్‌పాష తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ శ్రీనివాస్, డీఈవో సీహెచ్‌వి జనార్ధన్‌రావు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి వేణుగోపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గేదెల ఎంపికలో అధికారుల ఒత్తిడి

- ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఆవేదన


హరియాణాలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లబ్ధిదారులు

చందుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద 2020-21 సంవత్సరంలో ఎంపికైన లబ్ధిదారులు తమకు రెండు నెలల సూడి ఉన్న గేదెలను తీసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చందుర్తి మండల విలేకరులతో వారు గురువారం ఫోన్‌లో మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద చందుర్తి మండలం నుంచి 10 మంది రెండు గేదెల స్కీములో అర్హత సాధించారు. తమకు అధికారులు గేదెలను ఇప్పిస్తామని ఈనెల 8న హర్యానా రాష్ట్రంలోని రోహతకు జిల్లాలోని ఖురానా డైరీ ఫామ్‌కు ఎనిమిది నెలల సూడి గేదెలను ఇప్పిస్తామని తీసుకువచ్చారన్నారు. డైరీ ఫామ్‌కు వెళ్లిన తర్వాత రెండు నెలల సూడి గేదెలను తీసుకోవాలని తమను అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. రెండు నెలల సూడి గేదెను తీసుకుంటే దాదాపు ఏడు నెలల వరకు గేదెలను పోషించవలసి వస్తుందని, ఆర్థికంగా నష్టపోతామని పేర్కొన్నారు. ఎనిమిది నెలల సూడి గేదెని ఇప్పించడంతో నెలలోనే గేదె దూడకు జన్మనివ్వడంతో పాలు ఇస్తుందన్నారు. డైరీ ఫామ్ వారు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే డబ్బులు 8 నెలల సూడిగేదను ఇవ్వడానికి సరిపోవని ఎక్కువ డబ్బులు ఇస్తే ఇస్తామని చెప్పారని లబ్ధిదారులు తెలిపారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తొమ్మిది నెలల సూడిగేదెలను ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. కాగా లబ్ధిదారులు గురువారం రాత్రి హర్యానా నుంచి జిల్లాకు బయలు దేరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ఇళ్లు లేనివారికి అందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోరుట్లలో 1500, జగిత్యాలలో 6 వేల గుడిసెలు కూల్చిన ప్రభుత్వం గుడిసె ఉన్న ప్రతి ఒక్కరికి 120 గజాల స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానంలో భాగంగా నిజాం షుగర్ ఫ్యాక్టరీని వెంటనే ప్రారంభించాలని, నిరుద్యోగ యువతీ, యువకులకు చెరుకు రైతులకు ఉపాధి కల్పించాలని అలాగే బీడీ కార్మికులకు 26 రోజుల పని కల్పించాలని, జీవనభృతి రూ.4,016 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గర్వందుల రమేష్, తిరుపతి నాయక్, బుర్ర శేఖర్, మల్యాల సురేష్, వెంకటాచారి, తిరుపతి, కోమటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అదానీ వ్యవహారంపై మోదీ సమాధానం చెప్పాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అదానీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం జిల్లా కార్యదర్శి తాండ్ర సదాన ందం అధ్యక్షతన ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా చాడ వెంటకట్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అదానీపై అమెరికా చేసిన ఆరోపణలకు ప్రధాని నరేంద్రమోదీ సమాధానం చెప్పాలని, ఈ విషయమై కనీసం పార్లమెంటులో ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టినా, బీజేపీ ప్రభుత్వం దాటవేసే ధోరణి అవలంబిస్తోందని, ఈ మొత్తం వ్యవహారంపై పార్లమెంట్లో చర్చ జరగాలన్నారు. అదానీకి, ప్రభుత్వానికి మధ్య ఉన్న ఒప్పందాలను ప్రధాని మోదీ బహిర్గతం చేయాలని సూచించారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించారని, ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లు వచ్చేటట్లు కార్యాచరణ రూపొందించి నిరుపేదలను ఆదుకోవాలన్నారు. ఈనెల 26 నుంచి రాష్ట్రంలో జరిగే సీపీఐ వంద సంవత్సరాల ఉత్సవాలను జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో, ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతున్న దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, కర్షకులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమష్టిగా పోరాడి ప్రభుత్వం మెడలు వంచి తమ హక్కులు సాధించుకోవాలని, దానికి సీపీఐ ఎల్లవేళలా వారికి అండగా ఉంటుందన్నారు. జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ అనేక ఉద్యమాలకు నిలయంగా సీపీఐ ముందుంటుందని, ప్రభుత్వాలు మారినా బడుగుబలహీన వర్గాలకు పార్టీ అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గోశిక మోహన్, కార్యవర్గ సభ్యుడు గౌతమ్ గోవర్ధన్, రామగుండం నగర కార్యదర్శి కే కనకరాజ్, కౌన్సిల్ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, ఓదెమ్మ, పెద్దపల్లి పట్టణ కార్యదర్శి చంద్రగిరి ఉదయకుమార్, మనస్ కుమార్, సూర్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రీతం తదితరులు పాల్గొన్నారు

కోరుట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో సీపీఐ జిల్లా స్థాయి సమావేశం సీపీఐ నాయకురాలు ఎన్నం రాధ అధ్యక్షతన జరిగింది. అమరుల స్థూపంతో పాటు వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. 1925 డిసెంబర్ 26వ తేదీన సీపీఐ పార్టీ ఆవిర్భవించిందని అన్నారు. పార్టీ ఆవిర్భావంతో ప్రజా సమస్యలపై పోరాటం చేసి ఎన్నో సమస్యలు పరిష్కార దిశగా నడిచిందని అన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించే వరకు ప్రజలను చైతన్యం చేసిన పోరాట చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు. కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని, రైతు భరోసా చెల్లించాలని, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్ పెంపు మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెన్న సురేష్, చెన్న విశ్వనాథం, సుతారి రాములు, ఎండి ముక్రం, మనగూరి హన్మంత్, కొక్కుల శాంత, భూమేశ్వర్, ఎద్దండి భూమయ్య, ఎండి ఉస్మాన్, దేవదాస్, కిరణ్, రాంబాబు, వెన్న మహేష్, సమీర్, దశరథం, భూంరెడ్డి, అనంతరాజం, సాందారి మహేశ్, రాజన్నలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపవద్దు

- మెట్‌పల్లిలో వెల్లుల్ల గ్రామస్థుల ధర్నా


మెట్‌పల్లిలో ధర్నా నిర్వహిస్తున్న వెల్లుల్ల గ్రామస్థులు

మెట్‌పల్లి టౌన్/మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయంను ఎండో మెంట్‌లో కలుపవద్దని డిమాండ్ చేస్తూ గురువారం వెల్లుల గ్రామస్థులు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామం నుంచి మెట్‌పల్లికి ర్యాలీగా బయలుదేరి వచ్చారు. ఎండోమెంట్‌లో నుంచి వెంటనే ఎల్లమ్మ ఆలయంను తీసేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా ఆలయం నుంచి వస్తున్న ఆదాయంతో పాటు గ్రామస్థులందరం కలిసి ఆలయంను అన్ని విధాల అభివృద్ధి చేశామని అన్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో అభివృద్ధి చెంది న ఆలయంను ఓ ముగ్గురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎండోమెంట్‌లో కలప డంపై మండిపడ్డారు. అధికారులు స్వాధీనం చేసుకోవడంతో గ్రామస్థులు ఉపాధి కోల్పోతారని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎండోమెంట్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఘటన స్థాలంకు మెట్‌పల్లి సిఐ నిరంజన్‌రెడ్డి, డిఎఓ వసంతలు చేరుకోని గ్రామస్థులను సముదాయించారు. మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ముగిసిన గీతా జయంతి ఉత్సవాలు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో చేపడుతున్న గీతా జయంతి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. రాజన్న ఆలయంలో గురువారం ఉదయం అర్చకులు స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పరివార దేవతాలకు అభిషేకము, అర్చనలు చేపట్టారు. అనంతరం చేపట్టిన గీతహోమం కార్యక్రమంలో సంస్కృత పాఠశాల విద్యార్థులు భగవద్గీత పఠనం చేశారు. కార్యక్రమానికి రాజన్న ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా కార్యక్రమం


ఛాత్రోపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య

తిమ్మాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో ఛాత్రోపాధ్యాయులకు ఈ నెల 9నుంచి నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. లర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో డెల్ టెక్నాలజీస్ సహకారంతో ఛాత్రోపాధ్యాయులకు మహిళ సాధికారత, కృత్రిమ మేధస్సు అనే అంశంపై నాలుగు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా లర్నింగ్ లింక్స్ ఫౌర్మేషన్ అసిస్టెంట్ మేనేజర్ సంజీవులు ఛాత్రోపాధ్యాయులకు పలు అంశాలపై అవగాహన కల్పించారని చెప్పారు. ఛాత్రోపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న విషయాలను, తరగతి గది బోధనలో ఉపయోగిం చాలని చెప్పారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న 122 మంది ఛాత్రోపా ధ్యాయులకు సరిఫికెట్లను ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అంబేద్కర్ సంఘ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం


ఇరుకు గదిలో కూర్చున్న చిన్నారులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాలమైన గదులు, ఆటపాటలతో సాగాల్సిన అంగన్‌వాడీ కేంద్రం ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ సంఘం భవనంలో కొనసాగుతోంది. ఒకే గదిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సొంత భవనం లేకపోవడంతో ఇరుకుగా ఉన్న సంఘం భవనంలోనే చిన్నారులు, వంట, ఆట వస్తువులు, ప్రభుత్వం సరఫరా చేసే సరుకులను నిల్వ చేయాల్సి వస్తోందని అంగన్‌వాడీ టీచరు పేర్కొంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో 17 మంది చిన్నారులు ఉన్నారు. చిన్నారులు విద్యతోపాటు ఆటలు ఆడుకునేందుకు విశాలమైన గదులు లేకపోవడంతో ఇరుకు గదిల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. అంగన్‌వాడీ టీచరు అదే గదిలో ఓ సిలిండర్‌ను ఏర్పాటు చేసుకుని కోడిగుడ్లను ఉడకపెట్టడం, భోజనం తయారుచేస్తున్నారు. తన ఇంటి నుంచి వండిన కూరలను తీసుకొచ్చి వడ్డిస్తున్నారు. తాగు నీటి సౌకర్యం లేక దూర ప్రాంతం నుంచి నీటిని తీసుకు రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


అంబేద్కర్ సంఘ భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

రేకుర్తి కంటి ఆసుపత్రిని సందర్శించిన అంతర్జాతీయ ప్రతినిధి బృందం

భగత్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రేకుర్తి డాక్టర్ భాస్కర్‌మదేకర్ కంటిఆసుపత్రిని అంతర్జాతీయ ప్రతినిధి బృందం సభ్యులు గురువారం సందర్శించారు. లయన్స్ అంతర్జాతీయ ప్రతినిధి, అమెరికా గ్లోబల్ గ్రాంట్స్ స్పెషలిస్ట్ తాష హెడంరిచ్ రేకుర్తి కంటిఆసుపత్రిలో లెన్సోమీటర్ పరికరాన్ని ప్రారంభించారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించారు. ఆసుపత్రికి లయన్స్ అంతర్జాతీయ సంస్థ ద్వారా సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఛైర్మన్ కొండ వేణుమూర్తి, చిదుర సురేష్, బొమ్మపవన్‌కుమార్, ప్రకాశ్ హోళ్ల డాక్టర్ మురళీధర్‌రావు, ముక్క శరత్ కృష్ణ, శివకాంత్, వినోద్, రాజిరెడ్డి, కోదండరాములు, మొర భద్రేషం, తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే కార్యవర్గాన్ని అభినందించిన కేంద్ర మంత్రి

భగత్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఒక ప్రకటనలో అభినందించారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గాండ్ల శ్రీనివాస్, కార్యదర్శి కొయ్యడ చంద్రశేఖర్, కోశాధికారి గాజుల వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన గాండ్ల సంపత్‌లతో పాటు కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

భగవద్గీత ప్రవచనం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఒడిస్సి ఉన్నత పాఠశాలలో గురువారం భగవద్గీతపై తెలుగు పండితుడు కందాళై వేణుగోపాలాచార్య ప్రవచనం చేశారు. విద్యార్థులకు శ్లోక పఠనంపై అవగాహన కల్పించారు. ధర్మ మార్గంలో పయనించేందుకు దీప కాంతి వంటిది భగవద్గీత అని, అందులోని తత్వాన్ని అవగాహన చేసుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రేగులపాటి సరిత పాల్గొన్నారు.

భవన ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

గణేశ్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవనము ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయగలరని కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అయిలన్న కోరారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

'శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం'



గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఆర్డీవో మహేశ్వర్

కరీంనగర్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శారీరక ధృడత్వానికి క్రీడలు ఎంతగానో దోహద పడుతాయని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. మూడు రోజులుగా కరీంనగర్ మండలం నగునూర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈసందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు ఆర్డీవో బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. ఈ క్రీడలను విజయవంతంగా నిర్వహించిన ఎంపీడీవో సంజీవరావును, ఎంఈవో రవీందర్‌ను, క్రీడల నిర్వహణ కార్యదర్శి రమేష్, పీడీ, పీఈటీను అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతిరావు, పీడీలు శ్రీనివాస్, సౌజన్య, సంతోష్, రాజు, డానియల్ మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●భగత్‌నగర్: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో క్రీడలను ఎంపీడీవో శ్రీనివాస్ ప్రారంభించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి క్రీడలకు ఆతిథ్యం అందించి క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, పుట్‌బాల్, యోగాక్రీడాంశల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆజీం, ఎంపీవో నర్సింహారెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, ఎస్‌జీఎఫ్‌కార్యదర్శి వేణుగోపాల్, టీజీఎంఎస్ ఎలగందల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఆర్గనైజింగ్ సెక్రెటరీ గిన్నె లక్ష్మణ్, ఎల్ వెంకట రమణ, ఎ శ్రీనివాస్, బిశ్రీనివాస్, ఈహరీష్, ఎస్ సందీప్‌సింగ్, ఇంద్రజిత్‌సింగ్, రవికుమార్, సతీష్, నరేష్, సత్యం, సుష్మ, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●గంగాధర: గంగాధరలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలు గురువారంతో ముగిశాయి. గురువారం మోడల్ స్కూల్‌లో బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్లను జిల్లా స్థాయికి పంపించనున్నట్లు పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు హరికిషన్, రవీందర్, కృష్ణ వేణి, రజిత, దివ్య పాల్గొన్నారు.

●ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు హైస్కూల్ క్రీడా మైదానంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాణి, ఎంపీడీవో పుల్లయ్య, హెచ్‌ఎం జగదీశ్వర్, సత్యనారాయణ, పీఈటీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

●సైదాపూర్: సీఎం కప్ మండల స్థాయి క్రీడలు గురువారంతో ముగిసాయి. మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని జిల్లాస్థాయికి పంపించనున్నామని ఎంపీడీవో యాదగిరి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజూల, ఏపీవో రాణి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

గణేశ్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గణిత శాస్త్రంలో నూతన పద్ధతుల్ని శాస్త్రీయతను అలవర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జాతీయ గణిత శాస్త్ర దినోత్సవ సంబరాలలో భాగంగా స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాల, గణిత శాస్త్ర విభాగము ఆధ్వర్యంలో ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీ శ్రీనివాస రామానుజన్ గణితశాస్త్రంలో చేసిన పరిశోధనలపైం గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడుతూ ముఖ్యమైన అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ నిత్యజీవితంలో గణితశాస్త్రం ఎనలేని పాత్ర వహిస్తుందన్నారు. గణిత శాస్త్ర అధ్యయనం ద్వారా నుండి అంతరిక్షం దాకా అవకాశాలు ఉన్నాయని చెప్పారు. యువత ప్రతిభా సామర్థ్యాలతో అధునాతన సాంకేతిక విజ్ఞానంతో గణిత శాస్త్ర పరిశోధనలు శ్రీనివాస రామానుజన్ ఆదర్శంగా ముందుకు వెళ్లాలని కోరారు. గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ ను ఆదర్శంగా తీసుకొని యువత గణిత శాస్త్ర మేధావులుగా ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ పి.నితిన్, సాంఖ్యాశాస్త్ర విభాగ అధిపతి ఎం రాజేష్, అధ్యాపకులు డాక్టర్ స్వరూపరాణి, ఎలిజిబెత్ రాణి, డాక్టర్ అర్చన, రాజేశం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల బిల్లులు వెంటనే చెల్లించాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న మాజీ సర్పంచుల బిల్లులు చెల్లించాలని ఉమ్మడి జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. సంవత్సరం నుంచి బిల్లుల కోసం ఎదురుచూస్తూ తాజా మాజీ సర్పంచులు అప్పులు, వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే చాలా మంది మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రభుత్వం ఆత్మహత్యలను అరికట్టేందుకు బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.గురువారం ఆయన తాజా మాజీ సర్పంచుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు.

చదరంగ పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థికి పతకం

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నర్మదపురంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి పాఠశాలల అండర్-17 చదరంగ పోటీల్లో జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ టైనిటాన్స్ పాఠశాల విద్యార్థి సుప్రీత్ రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి సుప్రీత్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

యశోద ఆసుపత్రిలో అరుదైన చికిత్స

సుభాష్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో కరీంనగర్‌కు చెందిన జస్బీర్‌సింగ్‌కు అరుదైన చికిత్స అందించినట్లు యశోధ ఆసుపత్రి కన్సల్టెంట్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ దేవేందర్ సింగ్ తెలిపారు. కరీంనగర్ యశోద బ్రాంచిలో గురువారం చికిత్స వివరాలను ఆయన వివరించారు. యశోద ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో జస్బీర్ సింగ్ కేసు సంక్లిష్టతను అర్టెరియోవెనస్ మాల్ఫార్మేషన్ (ఎవిఎం)వాస్కులర్ ట్యూమర్‌గా గుర్తించి చికిత్స అందించి రోగి ప్రాణాలు కాపాడడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్‌లో వివేకానంద విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయంలో ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల శాతవాహన విశ్వ విద్యాలయంలో జరిగిన అంతర డిగ్రీ కళాశాలల వాలీబాల్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన కళాశాల విద్యార్థులు ఎం వికాస్, జి ఆకాష్, బి కరుణాకర్‌లుఏ శాతవాహన యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారని కళాశాల పీడీ పన్యాల శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వి ఆగంరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, ఏవో బండి శ్రావణ్ కుమార్, ఏసీవో బండి సంపత్‌కుమార్, అధ్యాప బృందం అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు కొత్తపల్లి రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు రూరల్ ఏడీఈ రఘు తెలి పారు. శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి మల్కాపూర్, కమాన్‌పూర్, లక్ష్మీపూర్, చింత కుంట, కమాన్‌పూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెంకన్న ఆలయానికి మోక్షమెప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

అక్కడి ప్రభుత్వం టీటీడీకి కొత్త పాలకవర్గాన్ని కొత్తగా నియ మించింది. టీటీడీ ఛైర్మన్ ఇటీవల రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కరీంనగర్ వేంకటేశ్వర ఆలయ నిర్మాణంపై చర్చించారు. స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ టీటీడీ ఛైర్మన్‌ను కలిసి ఈ దేవాలయ నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు. అందుకు టీటీడీ ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌తో ఇటీవల ఆలయ నిర్మాణ అంశాన్ని చర్చించారు. టీటీడీ ఆలయ నిర్మాణానికి నిధులు విడుదల చేసి పనులను ప్రారంభించాల్సిన అవసరం ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయలను విడుదల చేసి, టీటీడీ పాలకవర్గంతో, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖలు రాసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



పూజలో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్ డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ ప్రాంతంలో దాతల దాతృత్వంతో నిర్మాణం చేసిన శ్రీరామ మందిర అభివృద్ధికి కృషి చేస్తానని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం ఆలయంలో జరిగిన గోదా, రామానుజ, సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తుల ప్రతిష్ఠ, సీతారామ కల్యాణానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయ కమిటీ సభ్యుల కోరిక మేరకు మందిర ప్రాంగణంలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొండపల్లి సరిత-సతీశ్, కచ్చు రవి, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దన్నపునేని మాధవరావు, గజవాడ ఆంజనేయులు, కోశాధికారి నమిలకొండ నరసింహాచార్యులు, కిషన్‌ప్రసాద్, నరోత్తమ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, వసంతరావు, జీవన్‌రావు, శరత్‌రావు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు తీగలగుట్టపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో నీటి ఇబ్బందులను కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి అధికారులతో మాట్లాడి బోర్ మంజూరు చేయించారు. గురువారం పాఠశాల ఆవరణలో బోర్ వేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాస్ జిల్లా అధ్యక్షుడు | చంద్రశేఖర్ కార్యదర్శి | వెంకటేష్ కోశాధికారి | షుకూర్ ఉపాధ్యక్షుడు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడిగా గాండ్ల శ్రీనివాస్, కార్యదర్శిగా కొయ్యడ చంద్రశేఖర్, కోశాధికారిగా గాజుల వెంకట్ విజయం సాధించారు. బుధవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా శైలేందర్‌రెడ్డి, ఎండీ షుకూర్ ఎన్నికయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా కోటా కింద గాండ్ల సంపత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా సహాయ కార్యదర్శులుగా దాడి సంపత్‌కుమార్, పోలు సంపత్, సిర్ర తిరుపతి విజయం సాధించినట్లు జిల్లా ఎన్నికల అధికారి బుర్ర సంపత్‌గౌడ్ పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులుగా జన్నారం శ్రీనివాస్, కె.గంగరాజు, బూర తిరుపతి, ఎలిగేటి శ్రీనివాస్, కె.వేణుగోపాల్, కొంద్ర విజయశంకర్, డి.రాజశేఖర్, కె.రఘు, ఎండి.రఫీ, రేండ్ల నర్సింగం, కొత్తపల్లి చేతన్‌క్రాంతి, సిరిసిల్ల అనిల్‌కుమార్, మోసిన్, దొడ్డె కుమారస్వామి, బుర్ర పరశురాం, సారబుడ్ల రాజిరెడ్డి ఎన్నికయ్యారు. గురువారం ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని స్థానిక కరీంనగర్‌లోని ప్రెస్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశానికి జాతీయ కార్యవర్గసభ్యులు నగునూరి శేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఎస్సారెస్పీ కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభం

-'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు -కేంద్ర మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం



ఆరపల్లి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

కరీంనగర్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో ఎస్సారెస్పీ కాలువల్లో గురువారం పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'చివరి ఆయకట్టు రైతులకు నీరందేదెలా' అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాలతో అధికారులు స్పందించి సిల్ట్ తొలగించే పనులు చేపట్టారు. డీ-94 ప్రధాన కాలువలో పూడికతీత పనులు నిర్వహించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరడి శివారెడ్డి ఆధ్వర్యంలో రేకుర్తి, ఆరెపల్లి, సీతారాంపూర్, బొమ్మకల్, తీగలగుట్టపల్లి తదితర గ్రామాల రైతులు కలిసి విజ్ఞప్తి చేశారు. స్పందించిన కేంద్ర మంత్రి సంబంధిత అధికారులకు ఎస్సారెస్పీ కాలువల్లో ఉన్న పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో సంబంధిత అధికారులు గురువారం సిల్ట్ తీసే పనులను ప్రారంభించారు. పూడిక తొలగింపుతో యాసంగి పంటలకు అవసరమైన సాగు నీరు చివరి ఆయకట్టుకు అందే అవకాశం ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతం చేయాలి

హుజూరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం మాదిగ ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ బి శ్రీనివాస్, టి సంపత్ తెలిపారు. గురువారం హుజూరాబాద్‌లో వారు విలేకరు లతో మాట్లాడారు. పోరాటాలతోనే మాదిగ జాతి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్ రామచంద్రం, రత్నం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

జమ్మికుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. జమ్మి కుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం సందర్శించి సభ్యత్వ నమోదు చేప ట్టారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మా ట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమ లు చేస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అంజి, రాకేష్, అజయ్, రాంచరణ్, శౌర్యతేజ, వివేక్, చరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

ఇల్లందకుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులను గురువారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కర్‌చారి పర్యవేక్షణలో 239 బూత్ అధ్యక్షుడిగా ఉప్పుల శ్రీనివాస్‌రెడ్డి, 240 బూత్ అధ్యక్షుడిగా బండి సాంబరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కొత్త శ్రీనివాస్, మట్ట పవన్‌రెడ్డి, బాల్ రెడ్డి, బండి రాజు, సంపత్, ఓంకార్, కిరణ్, మల్లయ్య, సతీష్, రాజమహేందర్, రంజిత్, సంపత్, సదానందం, శంకర్, ప్రదీప్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం రేకుల షెడ్డు ప్రారంభం



షెడ్డును ప్రారంభిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయానికి అదనపు రేకుల షెడ్డు నిర్మాణాన్ని అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది గ్రంథాలయంలో షెడ్డు నిర్మాణం చేపట్టాలని తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. లక్ష రూపాయలతో ఈ షెడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు కనకలక్ష్మి, సంపత్, శ్రీనివాస్‌గౌడ్, వంశీధర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

శంకరపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వంకా యగూడెం గ్రామశివారులోని అయ్యప్పస్వామి ఆలయంలో అల్ఫోర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సుమన్‌శాస్త్రీ, గురుస్వామి చింతం సత్యనారాయణ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

రాష్ట్ర ప్రభుత్వం బీసీల వాటా తేల్చాలి

- ఫీజు బకాయిలు విడుదల చేయాలి
- బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు సంజయ్‌కుమార్



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

హుజూరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42శాతం వాటా తేల్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు జె సంజయ్‌కుమార్ అన్నారు. హుజూరాబాద్‌లో గురువారం బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో సగభాగమైన బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. బీసీల హక్కుల కోసం తీవ్ర స్థాయిలో పోరాటాలు చేస్తున్నప్పటికి ఫలితం లేకుండా పోయిందన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలు రూ. 7,600 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ నెల 16న హుజూరాబాద్‌లో ఫీజులు, బకాయిలు, బీసీ లకు 42శాతం వాటా పెంచాలని ఒక రోజు దీక్ష చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో శ్రీనివాస్, వెంకన్న, సాగర్, సదానందం, రవి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌లో 3కే రన్

చొప్పదండి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ సంబరాల్లో భాగంగా మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో గురువారం 3కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీరావు, ప్రిన్సిపాల్ జి కాళహస్తి, పీడీ ఇనాక్, పీఈటీ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ భాష దివస్

హుజూరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ప్రముఖ కవి బహు భాషావేత్త సుబ్రహ్మణ్య భారతి జన్మదినం సందర్భంగా ఘనంగా భారతీయ భాషా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని భాషలకు మూలం సంస్కృతం అని చెప్పారు. భాషలు నేర్చుకోవడం చాలా సులభమని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుమల, ఉపాధ్యాయులు ఆసియా, రాణి, ఈశ్వర్‌రెడ్డి, మాధవిలత, ప్రసాద్, శ్రీలత, శ్రావణి, రాములు, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

సైదాపూర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలం నుంచి చిగురుమామిడి మీదుగా సైదపూర్ మండలం వరకు ఉన్న కాలువ మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ. 15లక్షలు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంత సుధాకర్, సింగిల్‌విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలు తెలియజేయాలి

గంగాధర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలు ఉంటే రాజకీయ నాయకులు తెలియజేయాలని ఎంపీడీవో రాము అన్నారు. గంగాధర ఎంపీడీవో కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 గ్రామాల్లో 206 పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటికే వార్డుకు ఒకటి చొప్పున గుర్తించిన పోలింగ్ కేంద్రాల జాబితా ఆయా గ్రామ పంచాయతీల్లో నోటీస్ బోర్డుపై అందుబాటులో ఉంచామని తెలిపారు. అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, తెలుగు దేశం, బీఎస్పీ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, ఆయా పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజేశ్వరి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 222 వార్డులకు గాను 222 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాట చేశామని, అభ్యంతరాలు ఉంటే 17వ తేదీలోగా తెలియజేయాలని కోరారు. సమావేశంలో ఎంపీవో శ్రవన్‌కుమార్, పర్యవేక్షకులు రాజేష్, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, మాజీ వైస్ ఎంపీపీ పూరెల్ల గోపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మరవేణి తిరుపతి, సీపీఎం నాయకులు కోలపురి ప్రభాకర్, నాయకులు ఎల్లకపల్లి లచ్చయ్య, పంజాల శ్రీనివాస్ ఉన్నారు.

వీణవంక : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులు హాజరయ్యారు. సమావేశంలో నాయకులు కర్ర రాంగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బొబ్బల శ్రీధర్‌రెడ్డి, చరణ్ పాల్గొన్నారు.

90 రోజుల యాక్షన్‌ప్లాన్ పూర్తి చేయాలి



అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి

సైదాపూర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ డైరెక్టర్ ఇచ్చిన 90రోజుల యాక్షన్ ప్లాన్‌ను అధ్యాపకులు తప్పకుండా పూర్తి చేయాలని ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈవో) జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. కళాశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఐ ఈవో మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ఉన్నత విలువలతో కూడిన విద్యా అందించనున్నామని చెప్పారు. ఇంటర్ డైరెక్టర్ ఇచ్చిన 90రోజుల యాక్షన్ ప్లాన్‌ను అధ్యాపకులు తప్పకుండా పూర్తి చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాలని చెప్పారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుక రావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేందర్‌కుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణానికి చెందిన కోయల్‌కార్ శ్యామ్‌ను వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ సంస్థ జిల్లా వైస్ ఛైర్మన్‌గా నియమిస్తూ ఆ సంస్థ ఫౌండర్ డాక్టర్ నలమాస శ్రీకాంత్‌గౌడ్ గురువారం హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ వినియోగదారుడికి మేల్కొలిపే దిశగా పనిచేస్తానని తెలిపారు.

- హుజూరాబాద్ పట్టణానికి చెందిన పులుగు లతరెడ్డిని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి ప్రణయ్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లతరెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

● సైదాపూర్: మండలంలోని పెరుకపల్లి గ్రామానికి చెందిన శిరంశెట్టి సాయి ప్రశాంత్ తొలి ప్రయత్నంలోనే ఏవో (వ్యవసాయాధికారి)గా ఎంపికయ్యాడు. ప్రశాంత్ ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలోని కన్నేపల్లి మండల వ్యవసాయాధికారిగా విధులలో చేరారు.

- టీయూడబ్ల్యూజే(ఐజేయూ) కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సారబుడ్ల రాజిరెడ్డి విజయం సాధించారు. రాజిరెడ్డిని సైదాపూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బండారి గట్టయ్య, ప్రధాన కార్యదర్శి అనగోని తిరుపతి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంత సుధాకర్, సింగిల్‌విండో ఛైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి అభినందించారు.

● రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామంలోని ప్రశాంతి భవన్ అనాథ ఆశ్రమంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని యువజన కాంగ్రెస్ నాయకులు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ సుందర్‌రెడ్డి, నాయకులు మామిడి దిలీప్‌కుమార్, మల్యాల అక్షయ్‌కుమార్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, పల్లె రామ్‌రెడ్డి, చొప్పదండి అనిల్‌కుమార్, దేవాల సాయి, రాజశేఖర్, రాజనర్సు ఉన్నారు.

- హైదరాబాద్‌లోని కోకాపేటలో శనివారం దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి కులస్తులు తరలిరావాలని కురుమ సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు కడారి వీరయ్య, కడారి అయిలన్న, కోరె గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.